



ఇక ఈ శేషజీవితంలో ఎన్నడూ కథలు వ్రాయనని నేను ప్రతిజ్ఞ చెయ్యలేదుగాని, సాధ్యమైనంత వరకు వ్రాయడం మానెయ్యాలని మాత్రం అనుకున్నాను. నేను కథలు వ్రాయడం మానేస్తే ఈ లోకంలో ఎవ్వరూ నష్టపోయే దేమీ లేదనే సత్యాన్ని నేను చాలా

ఏళ్ళక్రితమే గ్రహించాను. ఐనా కీర్తికండూతి నన్ను అంత తేలిగ్గా వదిలిపెట్టక పోవడంవలన నానా విషయాలు వ్రాపి, పత్రికాముఖంగా వెదజల్లేను- సుమారు పాతికేళ్ళ పాటు! అంతా సుమారు ఐదారేళ్ళ నుండి నేనేం వ్రాసిన పత్రికా సంపాదకులు తిరగ్గొట్టేస్తున్నారు! నేటి పాఠకులకు ఏ రకం కథలు కావాలో పసిగట్టి వారికి కావలసిన రీతిలో కథలు వ్రాయగలిగే శక్తి సామర్థాలు నాకు లేవని గ్రహించాను విశ్రాంతితీసుకోవాలనే సదుద్దేశంతో ఇటుపైని కథలు వ్రాయడం మానేద్దామనుకున్నాను.

కాని నా యీ అభిమతానికి 'సరస్వతి' అడ్డు తగిలింది: సరస్వతి, నా భార్య పార్వతికి చిన్ననాటి స్నేహితురాలు. మూడు సార్లు యస్. యస్.యల్. సి. పోవడంతో నా భార్య పార్వతి చదువు చాలించేసింది! సరస్వతి మాత్రం బి.ఏ. పాసయింది. సరస్వతి బి.ఏ. పాసయినందుకు నా భార్య ఈర్ష్య పడలేదు. పైగా సంతోషించింది కూడాను. కాని నన్ను పెళ్ళాడినందుకు మాత్రం నేటికీ బాధ పడుతూనే ఉంది! సరస్వతిని కూడా ఆమె తల్లిదండ్రులు నా వంటి ఓ బీద బడిపంతులికి కట్టబెట్టుంటే బహుశా నా భార్య ఈనాడింతగా బాధ పడుండేది కాదేమో!

సరస్వతి భర్త ఓ లాయరు! బాగా సంపాదిస్తున్నాడు డబ్బు. సకల ఆధునిక సౌకర్యాలతోను నిర్మించబడ్డ ఓ పెద్ద భవంతి, ఓ కారు, ఓ సినిమాథియేటర్, బోలెడు బ్యాంక్ బాలన్సు ఉన్నవాడు!

సరస్వతి, ఆమె పిల్లలు ఎంతో అదృష్టవంతులని; తను, తన పిల్లలు ఎంతో దురదృష్టవంతులని నా భార్య అభిప్రాయం!

అందుకనే నేనంటే నా భార్యకు చాలా నిరసన భావ మేర్పడింది. నా భార్య ఎత్తిపొడుపు మాటలకు, అసహనానికి క్రమక్రమంగా అలవాటు పడిపోయేను నేను!

నా సహనాన్ని భార్యావిధేయతగా భావించే వాళ్ళ సంఖ్య అల్పమైన దేమీకాదు.

భార్యా విధేయులగు భర్తల్ని 'హెన్ పెక్డ్ హజ్‌బెండ్స్'గా గేలి చెయ్యడం నేటి సభ్య సమాజంలో ఒక సాధారణమైన విషయం! కాని పతికి విధేయులగు భార్యల్ని మాత్రం మన యీ పుణ్యభూమిలో 'పతివ్రత'లని కీర్తిస్తూంటారు!

అట్లా కీర్తింప బడుతూన్న

పతివ్రతలలో సరస్వతి ఒకతె!

అవాళ సరస్వతి మా యింటికి వచ్చి, "పార్వతి వుందా?" అని అడిగింది నన్ను.

"లేదు!" అని సమాధాన మిచ్చాను.

ఆమె వెంటనే వెళ్ళిపోతుం దను కున్నాను.

కాని బెంచీమీద కూర్చుంటూ, "ఎక్కడికి వెళ్ళింది?" అని అడిగింది.

"వాళ్ళ చెల్లెలు కూతురు పెళ్ళికి విజయనగరం వెళ్ళింది!"

"మాష్టారూ! చాలా కాలం నుండి మీ కథలేవీ ఏ పత్రికల లోనూ కనిపించడం లేదు. వ్రాసి పంపడం లేదా?" అనడిగింది.

"ఈ మధ్య వ్రాయడంలేదు. ఆ మధ్య వ్రాసి పంపిన కొన్ని కథల్ని ప్రచురణార్హత లేనివిగా భావించి తిప్పి పంపేశారు కొంత మంది పత్రికాధిపతులు!"

సరస్వతి ఎంతో ఆశ్చర్యంతో, "మీ కథల్ని తిప్పి పంపేశారా?" అనడిగింది.

"అవును. నేటి పాఠకులలో అధిక సంఖ్యాకులు మెచ్చే విధంగా వ్రాయలేకపోతున్నాను."

సరస్వతి కొద్ది క్షణాలసేపు మౌనంగా వూరుకొని, ఓసారి భారంగా నిట్టూర్చి, "మాష్టారూ నన్ను ప్రధాన పాత్రను చేసి మీరొక కథ వ్రాయకూడదూ?" అనంది.

ఆమె అలా అనేసరికి నేనెంతో ఆశ్చర్యపోయాను. 'ఇదేమిటి? తన గురించి కథ వ్రాయమంటుందేమిటి? ఈమె గురించి వ్రాయడానికి అసలు కథంటూ ఒకటుందా?' అనే ఆలో చనలో పడ్డాను.

"ఏమిటి మాష్టారూ, ఆలోచిస్తు న్నారు? నన్ను గురించి వ్రాయ డానికి కథంటూ ఏదైనా ఒకటుందా అనా?" అనడిగింది.

అప్రయత్నంగా నా నోటి వెంబడి. "ఊ!" అనే ఓ మూలుగు నీరసంగా వెలువడింది.

ఆమె తల బాగా దించుకొని, "నాకు మీవంటి వారు భర్తగా లభించుంటే ఎంతో బాగుండేది. నే నిప్పుడు ఇంకేమీ చెప్పలేను!" అని మెల్లగా గొణిగి గబగబా వెళ్ళి పోయిందామె.

ఆమె అలా అనేసరికి నేను నిర్ఘాంతపోయాను. అలా అన డంలో ఆమె ఉద్దేశ్యమేమిటని ఆలోచిస్తూ చాలాసేపు వాలుకుర్చీకి అతుక్కుపోయాను.

'సరస్వతికి ఇప్పుడేం లోటు? ఆమె భర్త మా ప్రాంతంలో బాగా

ప్రాక్టీసుగల గొప్ప అడ్వకేట్. ధనానికి, పలుకుబడికి, హోదాకు లోటులేదు. వండడానికి ఇంట్లో వంటమనిషి వుంది. పాచిపనులు చెయ్యడానికి పని మనుషులున్నారు. విందులకు వినోదాలకు లోటులేదు. ఇంతకుమించినహాయి ఈలోకంలో ఇంకేముంటుంది?

నా పెద్దకూతురు ఎలాగైతేనేం మెట్రికులేషన్ పాసయింది. దానికి పెళ్ళి చెయ్యగలిగే శక్తి నాకులేదని నాకన్నా దానికే బాగా తెల్సు. అందుకనే ఓ షాపులో సేల్సు గర్ల్‌గా కుదురుకుంది. ఇకపోతే నా రెండోకూతురు- నాపెద్దకూతురు కన్నా తెలివైనది. నేనెంతటి అసమర్ధుడినో, అప్రయోజకుడినో గ్రహించి తనదారి తాను చూసుకుంది. ఓ గొప్ప స్మగ్లర్‌గా ప్రఖ్యాతి గాంచిన వాడి కొడుకుని పెళ్ళాడేసింది. వాడికి డబ్బుకి లోటులేదు. ఎటొచ్చీ వాడికి మూగ, చెముడు! అయితేనేం? వాడికి డబ్బుంది. ఆ డబ్బుతో ఆనందాన్ని, సౌఖ్యాల్ని కొనుక్కోవచ్చు! దానికి కావలసినవవే! వాటికోసం అది ఎంతో వాచిపోయివుంది. అందుకనే మూగవాడూ, చెవిటివాడూ అయినా సరే- వాడిని పెళ్ళాడేసింది! వాడి డబ్బుతో అది ఎంచక్కా తన ముచ్చటల్ని తీర్చుకొంటోంది.

ఇక పోతే మూడోకూతురికి చిన్నప్పుడే పోలియోవచ్చి అవిటిదయిపోయింది. ఎడం చేత్తోనే అన్ని పనులూ చెయ్యగలుగుతోంది. దానికి నా పోలికలు కొన్ని ఉన్నాయి. చిన్న చిన్న కథలు వ్రాస్తోంది. భవిష్యత్తులో ఉత్తమ రచయిత్రిగా కీర్తి ప్రతిష్ఠల నార్జించుకోగలదేమోనని నా ఆశ!

నాలుగో సంతానం, అయిదో సంతానం కొడుకులు! పున్నామ నరకంనుండి నాకు విముక్తిని లభింపజేసే వంశోద్ధారకులు వాళ్ళు. అయితే వాళ్ళ ఆయుర్దాయం గురించే నాకు అనుమానం!

నా భార్యకు నాలో కనిపించని ఏ ప్రత్యేకత- సరస్వతికి నేడు నాలో కనిపిస్తోంది?

ఒక కథా రచయితగా కొన్నేళ్ళ క్రితంవరకూ నాకు తెలుగు పాఠక లోకంలో కించిత్ గుర్తింపున్నా, ఇప్పుడది కూడా లేదు. మరి సరస్వతి ఎందుకలా అంది?' ఎంత ఆలోచించినా నాకు సమర్ధనీయమైన సమాధానం స్ఫురించలేదు.

'ఆమెనే అడిగితే?'

ఒకవేళ ఆమె భర్త ఆమె నీమధ్య సవ్యంగా చూడలేదా? అలా అనుకోవడానికి అవకాశాలు చాలా

తక్కువ. ఎంచేతంటే భార్యని హింసించే స్వభావం కలవాడిగా ఊళ్ళో ఎవ్వరూ అతడిని వ్రేలెత్తి ఇంతవరకూ చూపలేదు.

అయితే ఒకటి-ఆమె భర్త ఈ ప్రాంతంలో గొప్ప హోదాగల వాడు గనుక, క్లబ్బులు, విందులు, వినోదాలు-ఇట్లాంటి నవీన నాగరికతా చిహ్నాలయిన సరదాలలో పాల్గొనకుండా తప్పించుకొనే అవకాశం అతనికి అంతగాలేదు.

ఏది ఏమైనా లాయర్ రావ్ భార్యని చిత్రహింసల పాలు చేసేటంతటి దుర్మార్గుడు మాత్రం కాదని నా విశ్వాసం!

లాయర్ రావ్ జీవితంతో సరిపోల్చి చూస్తే, నా జీవితం ఎంతో తేజోవిహీనమైనది. నాకు తెల్సినంతవరకూ ఇతరుల్ని, ముఖ్యంగా స్త్రీలను ఆకర్షించగలిగే ప్రత్యేక లక్షణాలేవీ నాలో లేవు. ఈ సత్యాన్ని, నా భార్య నా పట్ల వ్యవహరించే తీరునిబట్టి చాలా కాలం క్రితమే నేను గ్రహించేను. మరి నాలో గల ఏ ప్రత్యేకత సరస్వతిని ఆకర్షించిందో నా కవగతం కాలేదు. 'నాకు మీవంటి వారు భర్తగా లభించుంటే ఎంతో బాగుండేది!' అని సర్వతి అనడంలోగల ఆంతర్యం ఏమిటి?

ఎప్పుడో ఒకనాడు అవకాశం చూసుకొని, ఆమె అసంతృప్తికి కారణం ఏమిటో ఆమెనే అడిగి తెల్సుకోవాలనుకున్నాను. కాని ఇట్లాంటి వ్యక్తిగత విషయాలు తెల్సుకోడానికి చాలా బిడియపడే స్వభావం నాది. అందుకనే ఆ ప్రయత్నం మానుకున్నాను.

ఒకరోజున సరస్వతి మా యింటికి వచ్చి, "పార్వతి వచ్చిందా?" అనడిగింది.

"ఇంకా రాలేదు" అని సమాధాన మిచ్చేను.

"అది సరేగాని, నా కథ వ్రాసేరా?" అనడిగింది.

"లేదు."

"ఏం?.... ఎంచేత?"

"ఏం వ్రాయాలో తెలియక పోడం వల్ల!"

"భర్త నేటి సంఘంలో ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నా, ఇతరులచే ఎంతగా మన్ననలు పొందుతున్నా, తాళికట్టి పెళ్ళాడిన భార్యను హింసించక పోయినా, అతడొక త్రాగుబోతు జూదగాడు, వ్యభిచారి, అవినీతిపరుడు అయి; నైతికంగా పతనమయి పోతున్నప్పుడు అతని భార్య పొందే మానసిక వ్యథను విశ్లేషించి ఓ కథ వ్రాయలేరా? భర్త దరిద్రుడైనా, పరమ పవిత్రుడైనట్లయితే, ఆ దారిద్ర్యాన్ని ఎంతో సంతోషంగా అనుభవించ గలిగే

స్త్రీ హృదయాన్ని అవగతం చేసుకొని ఓ కథ వ్రాయలేరా?" అనడిగిందామె రుద్ధకంఠంతో.

ఆమె అలా అడిగేసరికి, నాకు నా భార్య పార్వతి స్మృతిపథంలో మెదిలింది! ఏమని సమాధాన మివ్వడమో బోధపడక మౌనం వహించేను.

"నాకు తెల్సు- మీరీ యితివృత్తాన్ని ఆధారంగా చేసుకొని ఓ మంచి కథ వ్రాయగలరని! మీరీ కథకు నే నాశించిన విధంగా మంచి ముగింపు నివ్వగలరని అనుకుంటున్నాను" అని అంటూ వెళ్ళిపోయిందామె.

కథ వ్రాయడమంటూ జరిగితే అప్పుడు ముగింపు గురించి ఆలోచించ వచ్చనుకున్నాను.

* * *

అవాళ నేనొక దుర్వార్త విన్నాను- సరస్వతి చనిపోయిందని!

పరామర్శకు వాళ్ళింటికెళదామని నేను బయలుదేర బోతూండగా, పోస్టుమాన్ ఓ టెలిగ్రాం అందజేసాడు. దానిలోని సారాంశం ఏమిటంటే, నా మూడో కూతురు అరుణ-అంటే పోలియోవ్యాధికి గురై అవిటయిపోయినది-కథల పోటీకి పంపిన కథకు ప్రథమ బహుమతి రెండువేల రూపాయలు వచ్చినట్లూ, వెంటనే ఒక ఫోటో జీవిత విశేషాలు పంపమనీనూ.

"ఏ౦వమ్మా అరుణా! నువ్వు పోటీకి పంపిన కథకు ప్రథమ బహుమతి వచ్చిందమ్మా!" అని ఎంతో ఆనందంతో ఆ టెలిగ్రామ్‌ను అరుణ చేతికిచ్చేను.

"ఆ కథ చిత్తుప్రతి నీ దగ్గరుంది కదూ?" అనడిగాను.

చిత్తు ప్రతి తీనుకొచ్చి నా చేతికిచ్చింది అరుణ.

చదివేను. ఆ కథ పేరు 'పతివ్రత.'

నన్ను ఏ కథ వ్రాయమని సరస్వతి కోరిందో, అదే కథను అరుణ వ్రాసింది. ఆత్మహత్యతో కథ ముగించబడింది.

తన కూతురు అరుణ వ్రాసిన కథకు ప్రథమ బహుమతి రెండు వేల రూపాయలు వచ్చినందుకు పార్వతి సంతోషించినంతగా, కూతురు వ్రాసిన కథను చదివి అంతగా సంతోషించలేకపోయింది.

"డబ్బూ, హోదా, దర్జా అన్నీ వున్న భర్తకి ఆ మాత్రం దురలవాట్లుంటే నష్టం ఏమిటి? ఆ మాత్రానికే చావాలా? ఇది పతివ్రతా లక్షణమా?" ఇదీ ఆ కథపై పార్వతి విమర్శ.

సరస్వతి స్థానంలో పార్వతి, పార్వతి స్థానంలో సరస్వతి వుండుంటే ఈ కథ ఎలా ముగిసుండేదో ఆలోచించగలిగే ఓపిక నా కిప్పుడు లేదు. *